www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 22 మే 2024

5

తూర్పుగోదావరి



నర్సరీ రైతులకు పెట్రోల్, డీజిల్ కష్టాలు

ప్రజాశక్తి-కడియం

ఎన్నికల్లో పలు ప్రాంతాల్లో అల్లర్ల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ లూజ్ అమ్మకాలపై నిషేధం విధించింది. ఆ నిషేధం నర్సరీ రైతులకు పెనుభారంగా మారిందంటూ మండలంలోని బుర్రిలంకకు చెందిన సప్తగిరి నర్సరీ రైతు కుప్పాల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సరీలకు నిత్యం నీళ్ల తడులు కావాలని, విద్యుత్ శాఖ కేవలం 7 గంటలు మాత్రమే నర్సరీ మోటార్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారని మిగిలిన సమయం డీజిల్ ఇంజన్‌పై ఆధారపడి నీళ్ల తడులు పెట్టుకుంటున్నట్టు తెలిపారు. పెట్రోల్ బంకుల్లో మూడు రోజులుగా వాహనాల ట్యాంక్‌లలో మాత్రమే పెట్రోల్, డీజిల్ విక్రయాలు చేస్తున్నారని, విడిగా అమ్మకాలు చేయమని చెబుతున్నారన్నారు. దీంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు.

నిబంధనలపై ప్రయి'వేటు'

- ప్రైవేటు కళాశాలల్లో కనీస సౌకర్యాల లేమి
- ఆకర్షణీయ ప్రకటనలతో విద్యార్థులకు గాలం
- అడ్డగోలుగా అడ్మిషన్లు
- అనుమతుల్లేకుండా హాస్టళ్ల నిర్వహణ
- అధికారులకు పట్టని వైనం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ర్యాంకుల సునామీ, అత్యుత్తమ ఫలితాల్లో మాదే అగ్రగామి, రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు మా విద్యార్థులకే సొంతం అంటూ అందమైన ప్రకటనలతో విద్యార్థులకు గాలం వేస్తున్న పలు, ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. జిల్లాలో నడుపుతున్న కొన్ని ఇంటర్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం శోచనీయం. ఇంటర్ బోర్డు నిబంధనలు పట్టని ఆయా కళాశాలలు అడ్డగోలుగా అడ్మిషన్లను దండుతున్నాయి. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సుమారు 200 ప్రైవేటు జూనియర్ కళాశాలలున్నాయి. వీటన్నింటిలోనూ దాదాపు 50 వేలు మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా పలు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అసౌకర్యాల నడుమ

పలు ప్రైవేటు కళాశాలల్లో ఇరుకు గదుల్లోనే నిర్వహిస్తున్నారు. ఫ్యాన్లు, మరుగుదొడ్ల కొరత వేధిస్తోంది. సిబ్బంది కొరత మరీ తీవ్ర తరంగా ఉంది. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలు సిబ్బందికి వేతనాలు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తుండడంతో తక్కువ మందిని నియమిస్తున్నారు. ఇలా పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేక అనేక మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు కూడా లేని పరిస్థితి కొన్ని కళాశాలల్లో కనిపిస్తుంది. ఇళ్ల నుండి తెచ్చుకుంటున్న నీటిపైనే ఆధారపడాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. సెక్షన్‌కు 80 మంది విద్యార్థులు, కోటా ప్రకారం సీట్ల కేటాయింపు బిల్డింగ్ పర్మిషన్, లీజ్ అగ్రిమెంట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, పార్కింగ్ స్థలం, ఫర్నిచర్, కంప్యూటర్ గది, సిబ్బంది ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాణ్యతమైన బోధనను అందించే అధ్యాపకులు లేని కళాశాలలు జిల్లాలో అనేకం ఉన్నాయి. వీటిపై పరిశీలన జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కాకినాడ, రాజమండ్రి వంటి ప్రాంతాల్లో కొన్ని కళాశాలలు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. నారాయణ, శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ కళాశాలలు బ్రాంచీల పేరుతో ఒకటి రెండు కళాశాలలకు అనుమతులు తీసుకుని, 4, 5 కళాశాలల ద్వారా అడ్మిషన్లు చేసి తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటువంటి కళాశాలలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కళాశాలలకు గుర్తింపులేని లేకపోతే విద్యార్థులు నష్టపోయే అవకాశాలున్నాయి. ఫలితంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సక్రమంగా అందే అవకాశం ఉంటుంది. గుర్తింపు లేని కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉపకార వేతనాలు రాక, సర్టిఫికెట్లు అందక ఉన్నత విద్యలో చేరేందుకు అడ్డంకులు ఏర్పడతాయి. ఇలా అనేక సమస్యలు వస్తాయి.

అనుమతుల్లేని హాస్టళ్లు

కాకినాడ జిల్లాలో దాదాపు అన్ని ప్రైవేటు కళాశాలలు అనుమతులు లేకుండానే హాస్టళ్లను నిర్వహిస్తున్నాయి. శ్రీ చైతన్య, అగస్త్య, వైవిధ్య, అఖిల్, ఆచార్య తదితర కళాశాలలు ఇంటర్ బోర్డు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే హాస్టళ్లు నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇలా జిల్లాలో ఉన్న పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు వ్యాపారమే పరమావధిగా ఇంటర్ బోర్డు నిబంధనలకు నీళ్లొదిలేలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

మాయ ప్రకటనలతో మభ్యపెట్టే యత్నం

పలు కళాశాలలు ఆకర్షణీయమైన ప్రకటనలను అదరగొడుతున్నాయి. అత్యధిక మార్కులు తమ సొంతం అంటూ ఉదర గొగుతున్నాయి. ఈ మాయలో పడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి లక్షలు దండుకుంటున్నాయి. కార్పొరేట్ సంస్థల్లో కాబోయే ఇంజినీర్లు, డాక్టర్లుగా తల్లిదండ్రులు ఊహించుకునే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలలకు అనుమతులున్నాయో లేవో చూసుకోవడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అనుమతులున్న కార్పొరేట్ల మాయ మాటలు సైతం నమ్మి మోసపోతున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలే ఉత్తమం

అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ప్రశాంతమైన తరగతి గదులు, సైన్స్ విద్యార్థులకు అన్ని రకాల ల్యాబ్ సదుపాయాలతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలను అందించే ప్రభుత్వ జూనియర్ కళాశాలలే ఉత్తమమైనవని ప్రభుత్వ అధికారులు, అధ్యాపకులు తెలుపుతున్నారు. పైసా ఫీజు చెల్లించనవసరం లేకుండా చదువుల్లో కొనసాగవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ముందస్తు ప్రణాళికతో కృషి చేస్తున్నారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలపై ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా ప్రజలకు తాగునీటి సమస్య నివారణకు సమన్వయ శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎన్‌ఆర్‌ఇజిఎస్, విద్యుత్, అర్బన్, రూరల్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఎన్నికల నేపథ్యంలో లా అండ్ ఆర్డర్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ మాధవీలత అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సమీక్షించారు. ఉపాధి హామీ పథకం బడ్జెట్ ప్రగతి లక్ష్యానికి గాను జిల్లాలో 30 లక్షల పనిదినాలకు గాను మే 2024 నాటికి 21.41 లక్షల పని దినాల లక్ష్యం దిశగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 11 లక్షల 21 వేల పనిదినాలు లక్ష్యాలను సాధించినట్లు పేర్కొన్నారు. మే 18వ తేదీన ఉపాధి కూలీలు 48,739 మంది హాజరుకాగా రోజుకు సగటున 5680 మందికి ఉపాధి పని దినాలు కల్పించినట్లు తెలిపారు. రోజుకు సగటు వేతనం రూ.249.41 ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మరింతగా పని దినాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద జిల్లాలో ఇప్పటి వరకు అమలు చేయబడిన టాప్ 5 అంశాల్లోని ప్రాధాన్యతా పనులకు సంబంధించి 2484 పనులకు 2,22, 596 మందికి పని దినాలు కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో త్రాగునీటి ఎద్దడి రాకుండా వేసవిని దష్టిలో ఉంచుకొని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు ఎప్పటికప్పుడు కార్యాచరణ ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రానున్న రోహిణి కార్తి దృష్టిలో ఉంచుకుని లో వోల్టేజ్ విద్యుత్ సమస్య లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే విధంగా విద్యుత్ శాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి లా అండ్ ఆర్డర్ సమస్యలేవి ఉత్పన్నం కాకుండా ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి సున్నితత్వం కలిగిన ప్రాంతాల విషయంలో ముందస్తు భద్రతా ఏర్పాట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు అని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బాణసంచా వేడుకలపై నిషేధం విధించినట్టు తెలిపారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-కడియం

నానాటికీ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బాధ్యతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గిరజాల బాబు అన్నారు. జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పర్యావరణ మిత్ర చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడియంలో మంగళవారం జీవవైవిధ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాబు మాట్లాడుతూ వాతావరణం కాలుష్యంతో ఇప్పటికే ఎన్నో జీవులు తమ ఉనికిని కోల్పోయాయన్నారు. అనంతరం ఎపి జీవ వైవిధ్యమండలి ప్రచురించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. జీవవైవిధ్యం పట్ల అవగాహన కల్పించే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. జీవవైవిధ్యం హరించిపోతే భవిష్యత్తులో ఈ భూగోళం మీద మానవ మనుగడ హాని ఏర్పడుతుందని చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. మాస్టర్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ గళ్ళా చిరంజీవి, పశు వైద్యులు పుట్టా శ్రీనివాసరావు, బ్రాహ్మణ సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేదాంతం నాని, పున్నమిరాజు వీర్రాజు, చెళ్లపిళ్ల వేంట శాస్త్రి, కళాసేవా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం, మలసాని గోవిందు, చింతాడ హరినాయుడు, బొర్రా రామకృష్ణ, యుటిఎఫ్ నాయకులు వేదుల శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దామిరెడ్డిపల్లిలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-కడియం

దామిరెడ్డిపల్లిలో మంగళవారం ఆరోగ్య సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 372 మంది పేషెంట్లకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 59 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీకి ఒకరిని రిఫర్ చేశారు. ఈ శిబిరంలో క్యాంప్ ఇన్‌ఛార్జి డాక్టర్ జి.స్వరూప, డాక్టర్ బి.నవ్య రాగ, సిహెచ్.ఆనందరావు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.విజయరాజు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కానూరులో వేసవి శిబిరం

ప్రజాశక్తి-పెరవలి

కానూరులో శ్రీరామ కష్ణ సేవా సమితి ఆధ్వర్యాన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుక మంగళవారం నడుపల్లిలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలో యోగ, ప్రార్థనా శ్లోకాలు, పద్యాలు, నీతి శ్లోకాలు భక్తి పాటలు ఆలపించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. గ్రామ పెద్దలు అన్నమ రెడ్డి రవీంద్రనాథ్ చౌదరి, అమరేశ్వరరావు, దివిలి సుబ్రహ్మణ్యం విద్యార్థులకు అందజేశారు. అనంతరం మాస్టర్ గిరి వెంకట రత్నం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చామర్తి సత్యనారాయణ, జ్యోత్స్న, సత్యనారాయణ రాజు, గోపాల్ రెడ్డి, అక్కింశెట్టి రాంబాబు, ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

చాగల్లులో 37.8 మి.మీ. వర్షపాతం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలంలో సోమవారం రాత్రి 37.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షం వల్ల వృద్ధులు, పిల్లలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ వర్షం మెట్ట ప్రాంతాలకు మాత్రమే ఉపకరిస్తుందని, వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు ఛిద్రమై ప్రయాణానికి ఆటంకంగా మారింది.

గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-చాగల్లు, పెరవలి

చాగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవిజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు నీతి కథలు, వేమన పద్యాలు బోధించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి వారు చదివిన పుస్తకాల్లో అంశాలపై గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాస్ సమీక్షించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఆటవిడుపుగా చదరంగం, క్యారమ్స్ ఆడించినట్టు ఆయన తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో 23 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. పెరవలి మండలం తీపర్రు, పెరవలి గ్రామాల్లో ఉన్న శాఖా గ్రంథాలయాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ పౌర గ్రంథాలయ శాఖ వారి ఉత్తర్వుల ప్రకారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు కథలు నేర్పించడం చదివించడం, డ్రాయింగ్ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు నైపుణ్యత కోసం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి 11:30 గంటల వరకూ సమ్మర్ క్లాసులు నిర్వహిస్తామన్నారు. రిసోర్స్ పర్సన్ మిరియాల ప్రియాంక విద్యార్థులకు గణితం, ఇంగ్లీషు వర్క్ డిక్టేషన్ జనరల్ నాలెడ్జి నేర్పించారు. విద్యార్థులతో ఇన్నర్ గేమ్స్ ఆడించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ పంచారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు కె.వెంకటేశులు, సిహెచ్.వెంకట జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌంటింగ్ వరకూ కోడ్, సెక్షన్ 30 అమలు

ప్రజాశక్తి-కడియం

సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల నియమావళితో పాటు సెక్షన్ 30 అమల్లో ఉంటుందని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. సౌత్ జోన్ పరిధిలోని కడియం, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం సిఐలు బి.తులసీధర్, వి.వినయమోహన్, రాజమండ్రి 2వ పట్టణ సిఐ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర పారామిలిటరీ బలగాలతో కలిసి మంగళవారం కడియం మండలం జేగురుపాడులో విస్తతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఎటువంటి రికార్డ్స్, నెంబర్ ప్లేట్లు లేని పది బైకులు, 10 విస్కీ బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసులు నమోదు నమోదు చేసినట్టు డిఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని, ముందస్తుగా అనుమతి లేకుండా ఏ విధమైన ఊరేగింపులకు, ప్రదర్శనలకు, బహిరంగ సభలకు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని చెప్పారు. ఎన్నికల లెక్కింపు అనంతరం మాత్రమే అటువంటి వాటి అనుమతులపై పరిశీలిస్తామన్నారు. బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజు అమ్మకాలు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉందని, శాంతి భద్రతల సమస్యలు సష్టించిన, ప్రేరేపించినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేయడం, అమ్మడం వంటివి చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందుగుండుకాల్చడం నిషేధించినట్లు తెలిపారు.

పాల్ లాబ్ ద్వారా ఆదర్శవంతమైన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం


పాల్ లాబ్ (పెర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) సంప్రదాయ బోధనా విధానాలలో కొనసాగుతున్న అభ్యాస అవాంతరాల ఒత్తిడిని అధిగమించడమే లక్ష్యంగా ఏర్పడ్డాయని రాష్ట్ర సమగ్ర శిక్షా అదనపు పథక సంచాలకులు బి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. స్థానిక గరిమెళ్ళ సత్యనారాయణ అత్యున్నత శిక్షణా అధ్యయన సంస్థ (ట్రైనింగ్ కాలేజీ)లో మంగళవారం పాల్ ల్యాబ్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం, గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పాల్ లాబ్ ద్వారా ఆదర్శవంతమైన విద్యావాతావరణం రూపొందించవచ్చున్నారు. విద్యార్థుల విభిన్న అభ్యసన అవసరాలు, అభ్యాస ప్రాధాన్యతలు అభ్యాసస్థాయి శైలి, పురోగతిని అంచనా వేసి వారి విద్యా ప్రయాణంలో సరైన దిశలో ముందుకు సాగేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత విద్యా సంవత్సరంలో ఏర్పడిన లోటుపాట్లను సవరించుకుని రానున్న విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయిలో పాల్ లాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ ద్వారా సందేహాలు నివృత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎడి ఎ.శ్రీనివాస్ సింగ్, జోన్-2 ప్రాంతీయ విద్యా సంచాలకులు బి.నాగమణి, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, రాష్ట్ర పాల్ ల్యాబ్ కో ఆర్డినేటర్ బి.కిషోర్, రాష్ట్ర పరిశీలకురాలు నాగమణి, జిల్లా సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, ఎఎంఒ గౌరీ శంకర్, సిఎంఒ శ్రీనివాసరావు, ఎఎస్ఒ వై.వి.ప్రసాద్, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఇవిబిఎన్ నారాయణ, ఐఇ కో ఆర్డినేటర్ కనక బాబు, డిఇఒ కార్యాలయ ఎఎస్ఒ ప్రసాద్, సురేష్, సత్తిబాబు, వీరబాబు, నాగిరెడ్డి, సురేష్ రాజు, తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ జిల్లాకు చెందిన పాల్ లాబ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులు, రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ సిఆర్‌పిలు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - సీతానగరం

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం సీతానగరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. సీతానగరం బస్టాండ్ సెంటర్లో రంగాశ్రీను ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ప్రస్తుతం దేశ ప్రజలు అనుభవిస్తున్న సాంకేతికకు రాజీవ్ గాంధీ ఆద్యుడని తెలిపారు. దేశానికి కాంగ్రెస్ పార్టీతోనే స్వేచ్ఛ, సుభిక్ష పరిపాలన వస్తోందని పేర్కొన్నారు. ఈ దోపిడీ దొంగల ప్రభుత్వాలను సాగనంపాలనే ఉద్దేశంతో రాజీవ్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, శ్రీను, మోర్తా అబ్బులు, దుళ్ల సూర్యనారాయణ, మట్ట రాము పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మాజీ ఎంఎల్‌ఎ పెండ్యాల కృష్ణబాబు మృతి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

ప్రముఖ రాజకీయవేత్త, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మాజీ ఎంఎల్‌ఎ పెండ్యాల కృష్ణబాబు (71) మంగళవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. 1983 నుంచి 94 వరకూ వరుసగా నాలుగుసార్లు కొవ్వూరు నుంచి టిడిపి ఎంఎల్‌ఎగా కృష్ణబాబు ఘన విజయం సాధించారు. 1999లో ఓటమి చెంది, 2004లో ఐదోసారి కొవ్వూరు ఎంఎల్‌గా గెలిచి కృష్ణబాబు రికార్డు సష్టించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డికి సన్నిహితుడు కావడంతో వైఎస్.జగన్మోహన్ రెడ్డి పెట్టిన వైసిపిలో కొన్నేళ్ల క్రితం చేరారు. 2009లో కొవ్వూరు నియోజకవర్గం ఎస్‌సి రిజర్వు కావడంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న కృష్ణబాబు 2019 ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి తానేటి వనితకు కొవ్వూరు అసెంబ్లీ వైసిపి టికెట్ ఇప్పించడంతోపాటు ఆమె విజయానికి కృషి చేశారు. అంతేకాకు రాష్ట్ర మంత్రివర్గంలో ఆమెకు నియామకానికి కృషి చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుదీర్ఘకాలం రాజకీయాల్లో కృష్ణ బాబు చక్రం తిప్పారు. టిడిపిలో ఉండగా కొవ్వూరు నియోజకవర్గంతో పాటు పోలవరం, గోపాలపురం నియోజకవర్గాలలో ఆయన అభ్యర్థుల విజయానికి వెన్నుదన్నుగా నిలిచారు. కష్ణ బాబు మరణ వార్త తెలిసిన వెంటనే కొవ్వూరుతో పాటు జిల్లావ్యాప్తంగా రాజకీయ వర్గాలు, ప్రజలు దిగ్రాంతికి గురయ్యారు. ఆంధ్రా సుగర్స్‌తో పలు ఫ్యాక్టరీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కృష్ణబాబు భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామమైన కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి తీసుకువస్తున్నారు. బుధవారం ఆయన పార్థివ దేహానికి అంత్రక్రియలు నిర్వహిస్తారు. కాగా కృష్ణ బాబు మృతికి సంతాప సూచకంగా రేపు కొవ్వూరువ్యాపార సంస్థలను మూసి వేస్తున్నట్లు వాణిజ్య వర్గాలు తెలిపాయి.

కృష్ణ బాబు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి-పెరవలి, చాగల్లు, దేవరపల్లి

కృష్ణ బాబు మతికి పెరవలికి చెందిన పలువురు నాయకులు సంతాపం తెలిపారు. కుందుల సత్యనారాయణ, కాచెర్ల సీతారామ్ ప్రసాద్, బొడ్డు రామాంజనేయులు, రవి వర్మ, పసలపూడి భద్రయ్య, వీరమల్లు సత్యనారాయణ, అతికాల శ్రీను, సలాది కృష్ణమూర్తి, బాలకృష్ణ సంతాపం తెలిపారు. చాగల్లు మండలంలోని వైసిపి, టిడిపి నాయకులు కృష్ణబాబు మృతికి సంతాపం తెలిపారు. దేవరపల్లిలో హోమ్ మంత్రి డాక్టర్ తానేటి వనిత కృష్ణబాబు మృతికి సంతాపం తెలిపారు. కృష్ణబాబు మరణం వ్యక్తిగతంగా తనకు, తమ పార్టీకి తీరని లోటు అన్నారు తన తండ్రి, మాజీ ఎంఎల్‌ఎ జొన్నకూటి బాబాజీ రావుకు కృష్ణబాబుతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

వ్యాధి నిరోధక టీకాలపై వర్క్ షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న డిఎం హెచ్ఒ, వైద్యాధికారులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వర రావు అధ్యక్షతన మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్ షాప్‌ను సర్వేయన్స్ మెడికల్ ఆఫీసర్ (ఎస్‌ఎంఒ) జాన్ జుడే జాషువా నిర్వహించారు. అయిదేళ్ల లోపు పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం అన్ని ఆరోగ్య క్రమాలపై రివ్యూ నిర్వహించారు. ప్రతి ప్రభుత్వాసుపత్రిలో తప్పని సరిగా ప్రసావాలు చేయించాలని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు ప్రతి నెలా నూరు శాతం పూర్తి చెయ్యాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణ కార్యక్తమాలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పూర్తి చేసి ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎన్.రాజకుమారి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు డాక్టర్ శ్రీహరి, డాక్టర్ సంధ్య, ప్రోగ్రాం అధికారులు, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



తనిఖీలో పాల్గొన్న అధికారులు

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

విజిలెన్స్, రెవెన్యూ ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం రాజమహేంద్రవరంలోని శ్రేడ్జ్ అస్సాం టీ, కీర్తి అస్సాం టీ, అస్సాం టీ షాపుల్లో తనిఖీలు చేశారు. ఎఫ్ఎస్ఎ సర్టిఫికెట్ లేకపోవడంతో ఫుడ్ ఇన్స్పెక్టర్ నోటీసులు జారీ చేశారు. నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్ టార్ట్రాజిన్, సన్ సెట్ పసుపులను టీ పౌడర్ కలపడంతో ఫుడ్ ఇన్స్పెక్టర్ టీ పౌడర్ ప్యాకెట్లను సమూనాలను పరీక్షల నిమిత్తం సేకరించామన్నారు. టీ పొడిని కల్తీ చేయడానికి ఉపయోగిస్తున్న టార్ట్రాజిన్ (పసుపు) సన్ సెట్ పసుపులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్యాకింగ్ లైసెన్సు లేకపోవడం, టీ పౌడర్ ప్యాకెట్లపై కన్స్యూమర్ కేర్ వివరాలు లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారని తెలిపారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తుండగా ఎంఎస్ఇ 6-ఎ కింద కేసు నమోదు చేసి గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. ప్యాకింగ్ లైసెన్సు లేకపోడం, స్టాంప్ లేని వెయింగ్ మెషిన్ కలిగివున్నందున లీగల్ మెట్రాలజీ అధికారులు కేసులు బుక్ చేశారని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాల నాయుడు, ఎస్ఐ వెంకట రాజు, జగన్నాథరెడ్డి, భార్గవ మహేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని అమరవిల్లి గ్రామానికి చెందిన బోరా దుర్గ (38) మంగళవారం గ్రామ శివారులో ఉన్న ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు...దుర్గ కొన్ని ఏళ్లుగా ఒక వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోంది. అయితే వారి మధ్య తగాద రావడంతో అతడు ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెప్పారు. ఆమెకు భర్త, పిల్లలు ఉన్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

కాపర్ వైర్ల చోరీ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి డైమండ్ జంక్షన్‌లో చోరీ సొత్తుతో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. తూర్పు గోదావరి, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని 120 వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్ఫార్మర్లు పగలగొట్టి అందులోనే కాపర్ వైర్లను దొంగిలించిన ముఠా నలుగురు కలిసి వ్యాన్‌లో అమ్మడానికి విజయవాడ తీసుకెళుతుండగా అరెస్టు చేసినట్లు దేవరపల్లి ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. కేసును కొవ్వూరు డిఎస్‌పి కెసిహెచ్.రామారావు పర్యవేక్షణలో, దేవరపల్లి సిఐ బాల సురేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేధింపులు తాళ లేక వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

భర్త వేధింపుల తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ కెఎం.జోషి తెలిపిన వివరాలు ఇవి.. గొల్లవిల్లి పంచాయతీ ఇందిరానగర్ కు చెందిన పరమట లలిత(29)ను ఐదేళ్ల క్రితం మునిపల్లి పంచాయతీ కోటు గట్టుకు చెందిన నాగారపు భీమేంద్రకు ఇచ్చి వివాహం చేశారు. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భర్త భీమేంద్ర ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో లలిత ఇంట్లో ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మతురాలి సోదరుడు పరమట ప్రసాదరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమలాపురం రూరల్ సిఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు. అయితే మతురాలు తల్లి పుష్పవతి కుటుంబ సభ్యులు మాత్రం లలిత ఆత్మహత్య చేసుకునే అంత పిరికిది కాదని భీమేంద్రే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారంటూ ఆరోపించారు. తహశీల్దార్ టి.మల్లికార్జున రావు పంచనామ నిర్వహించారు.సంఘటన స్థలాన్ని డిఎస్‌పి ఎం.మహేశ్వరరావు అమలాపురం రూరల్ సిఐ వీరబాబు, ఎస్ఐ జోషి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ముమ్మిడివరం నగర పంచాయతీ ప్రభుత్వాసుపత్రి సమీపంలో మంగళ వారం జరిగింది. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లికి చెందిన పి.సాయి తేజ మోటార్ సైకిల్ పై వేగంగా వస్తూ మోటార్ సైకిళ్లపై వెళుతున్న వెంకటేష్‌ను, గుబ్బల త్రిమూర్తులను ఢీ కొట్టాడు. అనంతరం సాయితేజ రోడ్డు పక్కన ఉన్న పుచ్చకాయల దుకాణం లోకి దూసుకుపోయాడు. ఈ ప్రమాదంలో త్రిమూర్తులు, వెంకటేష్, సాయితేజ గాయపడ్డారు. గాయ పడిన త్రిమూర్తులు, వెంకటేశులు ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయ పడిన సాయి తేజను అంబులెన్స్‌లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రి తరలించారు. దీనిపై ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటం గ్రామానికి చెందిన పామర్తి రాజేష్ ఆదివారం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఉండ్రాజవరం ఎస్ఐ వి.అప్పలరాజు తెలిపారు. ఆటోలో ఉల్లిపాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న రాజేష్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లి గూడెం ఉల్లిపాయలు కొని తెచ్చుకునేందుకు వెళ్లి, అప్పటినుండి కనిపించడం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిఠాపురంపై లక్షల్లో బెట్టింగ్

-నియోజకవర్గంపైనే అందరి చూపు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



పిఠాపురం కోటపై ఏ జెండా ఎగురుతుందో తెలియాలంటే జూన్ 4వ తేదీ వరకూ ఆగాల్సిందే. అయితే ఈ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పోటీ చేయడంతో అందరి దృష్టి ఈ నియోజకవర్గంపైనే ఉంది. ప్రస్తుతం గెలుపోటములపై హోరా హోరీగా ప్రచారం జోరందుకుంది. ఇదే అదునుగా కొందరు జూదరులు బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్నారు. ఈ బెట్టింగ్‌ల వ్యవహారం కోట్లలో ఉండటమే ఇక్కడ ప్రత్యేకత.

పిఠాపురం నియోజకవర్గంలో వైసిపి నుంచి వంగా గీత, జనసేన అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ పోటీలో ఉన్నారు. దీంతో అందరి చూపు ఈ నియోజకవర్గంపైనే పడింది. ఈ నియోజకవర్గం నుంచి పవన్ కళ్యాణ్ విజయం సాధిస్తారా? లేక వంగా గీత గెలుపొందుతారా? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికే నియోజకవర్గంలోని మండలాలు, బూత్‌ల వారీగా పడిన ఓట్లు ఆయా సామాజికవర్గాల వారీగా అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. ఇక్కడ వంగా గీతదే విజయమని వైసిపి నేతలు ప్రకటిస్తున్నారు. మరోపక్క పవన్ కళ్యాణ్ భారీ మెజారిటీతో విజయాన్ని అందుకుంటారని జనసేన నేతలు ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు జూదరులు స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి లక్ష వరకూ పందేలు కాస్తున్నారు. ఇప్పటికే ఈ బెట్టింగ్‌ల వ్యవహారం కోట్లల్లోనే జరిగిందని సమాచారం. పవన్ కళ్యాణ్ గెలుస్తాడని 1:5 చొప్పున అంటే రూ.లక్షకు రూ.5 లక్షలు చొప్పున పందేలు కలుపుకున్నారు. వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, చోటా నాయకులు మధ్యవర్తులు అవతారం ఎత్తి ఐదు శాతం కమిషన్‌తో జూదరులు పందేలకు పాల్పడుతున్నారు. ఎవరు గెలిచిన ఇక్కడ మధ్యవర్తులకు ఐదు శాతం కమిషన్ ఇవ్వడం అనేది ఇక్కడి ప్రత్యేకత. ఇప్పటికే పిఠాపురం, గొల్లప్రోలు, మండలాల్లో లక్షల రూపాయలు పవన్ గెలుస్తాడని బెట్టింగులు కాయగా, యు కొత్తపల్లి మండలంలో వంగా గీత గెలుపుపై పందాలు కాస్తున్నారు.

ఆస్తులపై కూడా పందాలు

రాజకీయ పార్టీలపై పిచ్చి అంతా ఇంతా కాదు పార్టీ ఏదైనా పోటీ చేసిన వర్గాల ఒక్కరు మాత్రమే విజయం సాధిస్తారు. కాని గెలుపోటములపై రాజకీయ నాయకులు ఆస్తులపై కూడా పందాలు కాసేందుకు సిద్ధపడుతున్నారు. లెక్కింపు సమయం 12 రోజులే ఉండడంతో భూములు, గృహాలు వంటి ఆస్తులపై పందాలు కాసేశారు. గెలుపోటములను పక్కన పెడితే ఈ పందేల్లో చేతులు కాల్చుకునే వారు మాత్రం వీధి పాలు అయ్యే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

-దోషులను శిక్షించాలని రాస్తారోకో
-సిఐ హామీతో ఆందోళన విరమణ



ధ్వంసం అయిన అంబేద్కర్ విగ్రహం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని అగ్రహారంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విగ్రహం ముఖ భాగాన్ని ధ్వంసం చేయడంతో స్థానికులు, దళిత సంఘాల నాయకులు మెయిన్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విగ్రహం ధ్వంసం చేసిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడ కుండా దత్త క్షేత్రం మీదుగా వాహ నుల ట్రాఫిక్‌ని మళ్లించారు. అక్కడికి చేరుకున్న సర్పవరం సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. విగ్రహం ధ్వంసం ఘటనలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని తమకు న్యాయం చేయాలని విరమించేది లేదని నిరసన కారులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీ సులు ఆందోళనకారులతో చర్చించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సదరు ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి వారిని గుర్తించి చట్ట ప్రకారం శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం సిపిఐ, దళిత సంఘాల నాయకులు, స్థానికులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.



రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ



లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రతిష్ట ఏర్పాట్లు చేయాలని జెసి, పిఠాపురం నియోజక వర్గం ఆర్ఓ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకినాడ పార్ల మెంటరీ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మంగళ వారం స్థానిక జెఎన్‌టియులోని సివిల్ డిపార్ట్‌మెంట్ పీజీ బ్లాక్ వద్ద చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు- 2024లో పోలైన ఇవిఎంలు ఇతర పోలింగ్ సామాగ్రిని జెఎన్‌టియులో నియోజక వర్గాల వారీగా ఆయా బ్లాకుల్లో సురక్షితంగా భద్రపరిచడం జరిగిందన్నారు. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ లను జెఎన్‌టియులోని సివిల్ డిపార్ట్‌మెంట్ పీజీ బ్లాక్‌లోను, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల వద్ద ఓట్లు లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని ప్రసంత వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

వేసవి శిబిరంలో రోబోటిక్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి

పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యా రావు భవనంలో నిర్వహి స్తున్న వేసవి శిబిరంలో మంగళవారం రోబో టిక్స్‌పై అవగాహన కల్పిం చారు. మహమ్మద్ జమీల్ అలీ మిత్ర బృందం విద్యార్థులకు అర్థమ య్యే రీతిలో అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు తాటిగడప సుబ్బారావు విద్యార్థులకు పద్యాలు పాడటంలో శిక్షణ ఇచ్చారు. అలాగే బుద్దా శ్రీనివాస్, దుంగల శ్యాం కుమార్ కాగితాలపై రంగు రంగుల బియ్యపు గింజలతో సీతాకోకచిలుకలను రూపొందించడంపై శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు టిఎల్.పద్మావతి కథలు చదవడం, కథలు చెప్పడంపై శిక్షణ ఇచ్చారు. దుంగల పూజితా సూర్యశ్రీ కరాటేలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. నీలపాల కృష్ణ కర్రసాము లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, మంజుల, అమృత పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం



మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ బీచ్ మార్గంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందన్, కండవల్లి రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీతి పద్యాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు నీతి పద్యాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో తెలుగు ఉపాధ్యాయులు తాటిగడప సుబ్బారావు విద్యార్థులకు నీతి పద్యాల సారాంశాన్ని వివరించారు. అనంతరం నీతి పద్యాలు పాడటంలో శిక్షణ ఇచ్చి విద్యార్థులతో నీతి పద్యాలు పాడించారు. ఈ శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్‌పైన శిక్షణ ఇచ్చారు. ఈ శిబిరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్‌వి.ప్రసాద్, సింగం బుల్లయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాకినాడ జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ కోరారు. మంగళవారం జగ్గంపేటలోని శివపార్వతి ఫంక్షన్ హాల్లో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్క రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలన్నారు. అదే సహకారం కౌంటింగ్ రోజున, తరువాత అందజేయాలని కోరారు.

సకాలంలో సాగునీరు అందేలా చర్యలు

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఉపాధి హామీ చట్టం ద్వారా పంట కాలువలు, డ్రయినేజీల్లో పూడికతీత పనులను ముమ్మరంగా చేపట్టి రైతాంగానికి సకాలంలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా డ్వామా జలవ నరుల అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విద్యుత్ సరఫరా, పోలింగ్ అనంతరం భద్రతల స్థితిగతులు, నరేగా పనుల నిర్వహణ వేసవిలో తాగునీటి సరఫరా స్థితిగతులు అంశాలపై జిల్లాల వారీగా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫ రెన్స్ అనంతరం అధికారులు ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ప్రస్తుత వేసవి దష్వా కాలువలో నీటి సరఫరా నిలిపివేసినందున నరేగా ద్వారా ఫీల్డ్ చానల్స్ లో పేరుకుపోయిన పూడిక తీత పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి సమ స్యలు ఉత్పన్నం కాకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా పుష్క లంగా తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలని ఆదేశించారు. తాగునీటి వనరులు అందుబాటులో లేని ఆవాసాలలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు. తాగునీటి ఎద్దడి సమస్యలు ఎక్కడా ఉత్పన్నం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవ హరించాలన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా శాంతియుత వాతావరణం లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాల న్నారు పెట్రోలు డీజిల్ లూజ్ అమ్మకాలు నిర్వహించకుండా పటి ష్టం నిఘా ఉంచాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల పరిధిలో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా బాణసంచా సామాగ్రి తయారు చేసేవారు ప్రస్తుతం మందు గుండు సామగ్రిని తయారు చేసి అమ్మకాలు నిర్వహించరాదన్నారు. ఓట్ల లెక్కిం పు అనంతరం గెలుపొందిన అభ్య ర్థులు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటు వంటి అవాంఛ నీయ సంఘటనలకు తావు లేకుండా కట్టుదిట్టమైన బందోబస్తును నిర్వహించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు .సార్వత్రిక ఎన్నికలు ముగిసిన క్రమంలో జూన్ నాలుగో తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుపై శ్రీనివాస కళాశాల ల్లో ఓట్ల లెక్కింపు అసెంబ్లీ, పార్ల మెంటుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించనున్న క్రమంలో.వీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయ కులు, ఇతర సిబ్బంది వివరాల జాబితాను ముందుగానే సిద్ధం చేసు కోవాలని తెలిపారు అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి ప్రత్యేక దారులు ఏర్పాటు చేయాలన్నారు బారికేడ్లు, మెష్లు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడు అంచెల భద్రత ఉంటుందన్నారు.స్ట్రాంగ్ రూమ్లు, తలుపులకు వేసిన సీళ్ళు, అక్కడ ఉన్న సెక్యూరిటీ, పరిసరా లను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గుర్తింపు కార్డులేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని సూచించారు. ఓట్ల లెక్కింపు సందర్భంలో ప్రజలు మీడియా ప్రతినిధులు పూర్తి సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూ ర్ అజయ్, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్. మధుసూదన్, సిపిఓ వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్‌సి సురేష్ బాబు, ఎన్నికల విభాగం సూపరింటెం డెంట్లు టి.వైద్యనాథ్ శర్మ, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ జయంతి వేడుకలకు సన్నాహాలు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో ఈ నెల 23న త్రిరత్న బుద్ధ విహార్ లో జరిగే 2568వ బుద్ధ జయంతి వేడుకలు సన్నాహాలు పూర్తి చేశామని నిర్వాహకులు అన్నారు. మంగళవారం అమలాపురం బుద్ధ విహార్ లో జరిగిన కమిటీ సమావేశమునకు డిబి.లోక్ అధ్యక్షత వహించారు. దీనికి బిఎస్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.హరిబాబు, బిఎస్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వి. దుర్గారావు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. డిబి.లోక్ మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు బుద్ధ విహార్ నందు బౌద్ధ భిక్షువులచే ప్రార్థన కార్యక్రమం, 10 గంటల నుంచి ఊరేగింపు, అనంతరం అంబేద్కర్ భవన్ లో సభా కార్యక్రమం నిర్వ:హిస్తారన్నారు. అంబేద్కరీయులు, బౌద్ధులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, ఉద్యోగులు అందరు పాల్గొని ఈ కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిఎస్ఐ జిల్లా అధ్యక్షులు రాంబోది కాశి, బుద్ధ విహార్ సభ్యులు పాల్గొన్నారు.

25న సుబ్బారావుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కొత్తపేట

రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి వివివిఎస్.సుబ్బారావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. సుబ్బారావులో ఉన్న ప్రతిభను గుర్తించిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రతిపాదించింది. ఈనెల 25న చెన్నైలోని భారతీయ విద్యా భవన్ లో గౌరవ డాక్టరేట్ తో పాటు భారత కళా రత్న అవార్డును సుబ్బారావు స్వీకరించనున్నారు.

శిథిలావస్థలో ఉచ్చిలి ఎత్తిపోతల పథకం

సాగునీరందక రైతుల అవస్థ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ఉచ్చిలి ఎత్తిపోతల పథకం శిథిలావస్థకు చేరింద. దీంతో రైతులకు సాగునీరు అందక పంట పొలాలు బీడు వాడుతున్నాయి. ఈ పథకంలోని మూడు మోటర్లు మరమ్మతులు గురై పాడైపోయి సంవత్సరాలు కావస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేక పోవడంతో రైతులకు సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు . ఈ పథకం ద్వారా ఉచ్చిలి, ఆత్రేయపురం, వాడపల్లి, లొల్ల గ్రామాల పరిధిలో సుమారు 16 వందల ఎకరాలకు సాగునీరు అందుతుంది. రెండు సంవత్సరాల నుండి ఈ పథకంలోని మోటర్లు గురవడంతో మరమ్మతులు చేయడానికి ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడంతో ఈ పథకం శిథిలావస్థకు చేరింది. గతంలో మూడు మోటర్లు పనిచేయడంతో పుష్కలంగా నీరు ఉండేది. ఈ పథకం ద్వారా 1600 ఎకరాలలో ఉద్యానవన పంటలకు రైతులు సాగునీరు పెట్టుకునేవారు. ఇరిగేషన్ అధికారులు ఈ పథకంపై దృష్టి సారించకపోవడం అధికారుల మధ్య సమన్వయ లోపం తలెత్తడంతో ఈ పథకం మరుగున పడింది. రైతులు ఎన్నిసార్లు ఇరిగేషన్ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదు. నియోజవర్గ ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లిన వారు నిమ్మకు నిరుతున్నట్లు వ్యవహరించేరే తప్ప రైతు సమస్యలను పట్టిం చుకోలేదు. ప్రభుత్వాలు మాత్రం రైతు సంక్షేమ దిశగా అడుగులు వేస్తు న్నామని వారి అభివృద్ధి ధ్యేయమని చెబుతాన్నరు తప్ప రైతు సమస్యలను పట్టించుకున్న వారే కరువయ్యారు.

గోదావరి జలాలు పొలాలు పెట్టడం ద్వారా రైతులకు మేలైన దిగుబడులు వస్తాయి దీంతో రైతులు పంట కాలువల ద్వారా సాగునీటిని పొలాలు మళ్ళించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.



ఎండిపోయిన పంట కాలువ



శిథిలావస్థకు చేరిన ఎత్తిపోతల పథకం

తాగునీరు అందడం లేదు



ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందడం లేదు పొలాలు వీడు వాడుతున్నాయి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదు. మోటర్లు మరమ్మతులు గురై రెండు సంవత్సరాలు పైన అవుతుంది నేటికీ మరమ్మతులు చేయించలేదు. **-నడింపల్లి సుబ్బరాజు, రైతు, ఉచ్చిలి**